క్లుప్తంగా

కష్టపడి చదివితేనే భవిష్యత్



యువకులను సన్మానిస్తున్న గ్రామస్తులు

ఇచ్చోడ: కష్టపడి చదివితేనే భవిష్యత్ ఉంటుందని కోకసమన్నూర్ మాజీ సర్పంచ్ బత్తుల గంగారాం అన్నారు. గ్రామానికి చెందిన బత్తుల ప్రశాంత్, గోవుల నాగ చైతన్య ఇటీవల ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారు. దీంతో శనివారం గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో ఇద్దరు యువకులను శాలువాతో సన్మానించారు. కష్టపడి చదువుకొని ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన ఇద్దరిని యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు నరాల శ్రీనివాస్, కాండ్లి రమణయ్య, జాదవ్ తుకారాం, గోగారి సుభాష్, కాండ్లి శంకర్, నరాల రాజేశ్వర్, కృష్ణం రాజు పాల్గొన్నారు.

ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేయాలి



సీఐకి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలో ట్రాఫిక్ సిగ్నల్ ఏర్పాటు చేసి రోడ్డు ప్రమాదాలు జరగకుండా చూడాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి సిర్ర దేవేందర్ అన్నారు. శనివారం ఆదిలాబాద్ ట్రాఫిక్ సీఐ ప్రణయ్‌కు వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ కొమురంభీం చౌక్, బస్టాండ్, నేతాజీచౌక్, పంజాబ్ చౌక్, తిరుమల పెట్రోల్‌బంక్ ప్రాంతాల్లో సిగ్నల్ ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అబ్దుల్ మోయిజ్, తదితరులు పాల్గొన్నారు.

21న అప్రెంటీస్ మేళా

ఆదిలాబాద్‌టౌన్: ఐటీఐ ఉత్తీర్ణులైన విద్యార్థులకు జిల్లా కేంద్రంలోని ఐటీఐ కళాశాల ఆధ్వర్యంలో ఈనెల 21న ప్రధాన మంత్రి జాతీయ అప్రెంటిస్ మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ పి.శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ఐటీఐ పాసైన విద్యార్థులు www.apprentiershipind-ia.gov.in వెబ్‌సైట్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. మేళాకు హాజరయ్యే అభ్యర్థులు రిజిస్ట్రేషన్ పత్రం, ఆధార్ కార్డు, ఎస్సెస్సీ మెమో, కుల ధ్రువీకరణ పత్రం, రెండు పాస్‌ఫొటోలతో హాజరు కావాలని కోరారు.

నేడు సాధికారత వారోత్సవాలు

ఆదిలాబాద్‌టౌన్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 134వ జయంతిని పురస్కరించుకొని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో సామాజిక సాధికారత వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సంగీత, రీజినల్ కోఆర్డినేటర్ జగ్‌రాం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని సైన్స్ డిగ్రీ కళాశాలలో ఆదివారం ఉదయం 10 గంటలకు భారత రాజ్యాంగం, సామాజిక న్యాయం అనే అంశంపై ఉపన్యాస పోటీలు, 11 గంటలకు భారత రాజ్యాంగ ప్రావేశికను ఎలా అర్థం చేసుకున్నారు అనే అంశంపై ఉపన్యాస పోటీలు నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. మొదటి బహుమతి రూ.1200, ద్వితీయ బహుమతి రూ.800 నగదు అందించడం జరుగుతుందన్నారు.

ఆట వస్తువులు విరాళం

బోథ్: మండలంలోని ధన్నూర్(బి) గ్రామానికి చెందిన ప్రమోద్ గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థుల కోసం శనివారం ఆట వస్తువులను అందజేశారు. ఆట వస్తువులను గొడిసెల రమణ గౌడ్, అల్లం సాయికృష్ణ ద్వారా అందించారు. కాగా తమ పాఠశాలకు ఆట వస్తువులను అందజేసిన ప్రమోద్‌ను ప్రధానోపాధ్యాయులు రావుల శంకర్ ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ముగిసిన హనుమాన్ పారాయణం



హనుమాన్ చాలీసా చదువుతున్న భక్తులు

నేరడిగొండ: మండల కేంద్రంలోని శ్రీ రాజరాజేశ్వర ఆలయంలో గత వారం రోజులుగా భక్తులు హనుమాన్ చాలీసా పారాయణం చదువుతున్నారు. శనివారం హనుమాన్ జయంతిని పురస్కరించుకొని ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో భక్తులు ఏలేటి సుధాకర్ రెడ్డి, చక్రదర్ రెడ్డి, గంగాధర్, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా హనుమాన్ జయంతి

- ప్రత్యేక పూజలు చేసిన భక్తులు
- ఊరూరా శోభాయాత్రలు



తలమడుగు: హనుమాన్ ఆలయంలో ఎంపీ నగేశ్, ఎమ్మెల్యే అనిల్ జాదవ్



శోభాయాత్రను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్



నార్నూర్: నాగల్‌కొండ గ్రామంలో..



బేల: సింగాపూర్ ఆలయ ఆవరణలో..



దర్శనం చేసుకుంటున్న అడ్డి భోజారెడ్డి



ఇంద్రవెల్లి: వాల్గోండలో పూజలు చేస్తున్న భక్తులు

నేరడిగొండ: మండల కేంద్రంతో వడూర్, తేజాపూర్, కుమారి, కుప్టి, తర్నం, వాంకిడి, బుగ్గారం, కుంటాల, రాజుర గ్రామాల్లో శనివారం హనుమాన్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. సాయంత్రం హనుమాన్ శోభాయాత్రను బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్, తెలంగాణ రాష్ట్ర లెక్చరర్ల సంఘం ప్రధాన కార్యదర్శి జాదవ్ బలరాంలు ప్రత్యేక పూజలు చేసి ప్రారంభించారు.

బేల: మండల కేంద్రంతో పాటు సింగాపూర్(సిర్సన్న), పోనాల, చప్రాల గ్రామాల శివారుల్లోని హనుమాన్ ఆలయాల్లో హనుమాన్ జయంతిని నిర్వహించారు. హనుమాన్ విగ్రహానికి భజన కీర్తనలతో అభిషేకం చేపట్టి, ప్రత్యేక పూజలతో ధ్వజ స్తంభస్థాపన కార్యక్రమం చేపట్టారు. సింగాపూర్(సిర్సన్న) హనుమాన్ ఆలయ ఆవరణలో దీక్షను అర్చకులు దినేష్ చౌదరి విరమింపచేశారు.

తాంసి: తాంసి, భీంపూర్ మండలాల్లో శనివారం భక్తులు హనుమాన్ జయంతి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఉదయం నుంచే ప్రత్యేక పూజలు చేసి హనుమాన్ దర్శనం చేసుకున్నారు. తాంసి మండల కేంద్రానికి సమీపంలో ఉన్న అభయాంజనేయ ఆలయంలో డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ పూజలు చేశారు.

తలమడుగు: మండలంలోని కోసాయి, సుంకిడి, కుచులపూర్, లింగి గ్రామాల్లో హనుమాన్ జయంతి వేడుకలను శనివారం ఘనంగా జరుపుకున్నారు. కోసాయిలో పంచముఖి ఆలయంలో నిర్వహించిన వేడుకల్లో ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేశ్, బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. సుంకిడి గ్రామం సమీపంలోని హనుమాన్ ఆలయంలో మాజీ ఎమ్మెల్యే జోగు రామన్న, బోథ్ కాంగ్రెస్ ఇన్‌చార్జి ఆడే గజేందర్ పూజలు చేశారు.

నార్నూర్: హనుమాన్ జయంతి సందర్భంగా మండల కేంద్రంతో పాటు భీంపూర్ శనేశ్వరాలయం, రాజులగూడ, తాడిహత్నూర్ గ్రామాలలో జయంతి ఉత్సవాలను శనివారం ఘనంగా జరుపుకున్నారు. అంజనేయ స్వామి ఆలయ వద్ద ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు.

గాదిగూడలో:

గాదిగూడ మండలంలోని లోకారి(కే), గాదిగూడ, మేడిగూడ, కొలామా, ఖాండోరాంపూర్ గ్రామాల్లో హనుమాన్ జయంతి ఉత్సవాలను ఘనంగా జరుపుకున్నారు. భక్తిశ్రద్ధలతో ఆలయాల వద్ద ప్రత్యేక పూజలు చేశారు. ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక మార్గంలో నడవాలని ఆయా గ్రామాల పటేళ్లు కోరారు.

బోథ్: బోథ్, సొనాల మండలాల వ్యాప్తంగా హనుమాన్ జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. బోథ్ మండల కేంద్రంలో నిర్వహించిన హనుమాన్ శోభాయాత్రలో ఎమ్మెల్యే అనిల్ జాదవ్, బలరాం జాదవ్‌లు పాల్గొన్నారు. సొనాల, కనుగుట్ట, పాచ్చెరతో పాటు పలు గ్రామాల్లో శోభాయాత్ర నిర్వహించారు.

ఇంద్రవెల్లి: మండల కేంద్రంతో పాటు మండలంలోని గ్రామాల్లో హనుమన్ జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. హనుమన్ ఆలయంలో ప్రత్యేక పూజలు మధ్య ఆలయాల ఎదుట జెండాలు ఆవిష్కరించి పూజలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

ఇచ్చోడ: మండలంలో హనుమాన్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. మండల కేంద్రంలో సాయంత్రం హనుమాన్ విగ్రహంతో శోభాయాత్ర చేపట్టారు.

సంస్కృతి, సంప్రదాయాలు కాపాడుకోవాలి



ర్యాలీ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు

ఉట్నూర్‌రూరల్: ప్రతిఒక్కరూ సంస్కృతి సంప్రదాయాలను కాపాడాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు అన్నారు. మండల కేంద్రంలో హనుమాన్ జయంతి సందర్భంగా హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీను ఏఎస్పీ కాజల్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. హనుమంతుడి ఆశీస్సులు ప్రజలపై ఎల్లప్పుడు ఉండాలని ప్రపంచమంతా సుఖ సంతోషాలతో ఉండాలని వేడుకున్నారు. బీజేపీ నిర్మల్ జిల్లా ఇన్‌చార్జి రితేశ్ రాథోడ్, బీఆర్ఎస్ ఖానాపూర్ ఇన్‌చార్జి జాన్సన్ నాయక్‌లు పాల్గొన్నారు. పట్టణ కేంద్రంతో డప్పు చప్పుల మధ్య ప్రధాన వీధుల గుండా ర్యాలీ కొనసాగింది.

యువతి పెళ్లికి ఆర్థిక సాయం

ఉట్నూర్‌రూరల్: మండలంలోని లక్కెటిపేట గ్రామానికి చెందిన మెస్రం అనిత తల్లిదండ్రులు కొన్ని సంవత్సరాల క్రితం మృతి చెందారు. దీంతో యువతి అనాథగా మారింది. గ్రామపెద్దలు ఈనెల 14న మెస్రం అనిత పెళ్లి అర్క మహేశ్‌తో నిశ్చయించారు. శనివారం ఉట్నూర్ మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో వెడ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో యువతి వివాహానికి రూ. 15వేల ఆర్థిక సాయం అందజేశారు.

జార్జిరెడ్డికి ఘన నివాళి



పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

ఆదిలాబాద్‌టౌన్: పీడీఎస్‌యూ నాయకుడు జార్జి రెడ్డి వర్ధంతిని జిల్లా కేంద్రంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన చేసిన సేవలను కొనియాడారు. జార్జిరెడ్డిపై కత్తులతో దాడి చేసి కొందరు హతమర్చారని పేర్కొన్నారు. ప్రస్తుతం దేశంలో మతోన్మాద, మనువాద రాజ్యస్థాపన కోసం బీజేపీ ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తుందని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సిడాం సాయికుమార్ తెలిపారు. విద్యారంగాన్ని ప్రైవేటీకరణ చేసేందుకు కుట్రలు జరుగుతున్నాయని ఆరోపించారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు మడావి కిరణ్, సాయికిరణ్, ఆకాష్, భగవాన్ పాల్గొన్నారు.

విద్యార్థుల సమస్యలపై పోరాడాలి



పెందూర్ సంతోష్‌ను సన్మానిస్తున్న గ్రామస్తులు

నార్నూర్: ఏజెన్సీలోని ఆదివాసీ విద్యార్థుల సమస్యలపై పోరాడాలని పున్నగూడ గ్రామపటేల్ పెందూర్ రమేశ్ అన్నారు. శనివారం గాదిగూడ మండలంలోని పున్నగూడ గ్రామంలో ఆదివాసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన పెందూర్ సంతోష్‌ను గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. ఏజెన్సీ ప్రాంతంలో కనీస సౌకర్యాలు లేని మారుమూల గ్రామాల నుంచి అంచెంచెలుగా ఎదుగుతూ ఆదివాసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికవడంతో గ్రామస్తులకు గర్వకారణంగా ఉందన్నారు. ప్రజా సమస్యలపై పోరాడాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు కుడ్మెత మాధవరావు, పెందూర్ తుకారం, పెందుర్ కిస్టు, మెస్రం జంగు, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ హయాంలోనే ఆలయాల అభివృద్ధి



ప్రత్యేక పూజలు చేస్తున్న జోగు రామన్న

ఆదిలాబాద్: బీఆర్ఎస్ హయాంలోనే ఆలయాల అభివృద్ధి జరిగిందని మాజీ ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. శనివారం హనుమాన్ జన్మ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని పలు హనుమాన్ ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హనుమంతునీ ఆశీస్సులతో ఆదిలాబాద్ జిల్లా ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఆధ్యాత్మిక మార్గంలో నడుస్తూ సనాతన ధర్మ పరిరక్షణకు పాటుపడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు నారాయణ, ప్రహ్లాద్, గణేష్, సతీష్, తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన



విగ్రహ ప్రతిష్ఠాపనలో పాల్గొన్న ఎమ్మెల్యే

బోథ్: మండలంలోని పట్నాపూర్ గ్రామంలో ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య విగ్రహ ప్రతిష్ఠాపన నిర్వహించారు. ఎంపీ గోడం నగేశ్, బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్, కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడె గజేందర్, మాజీ ఎంపీ సోయం బాపూరావ్, మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావ్, బోథ్ మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డిలు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయానికి ప్రహరీ నిర్మాణానికి నిధులు కేటాయిస్తామని ఆడె గజేందర్ తెలిపారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ఆలయానికి విరాళం అందజేత

ఖానాపూర్: పట్టణంలోని శ్రీరాంనగర్ కాలనీలో ఉన్న శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయ అభివృద్ధి కోసం కాలనీకే చెందిన పంబాల సంగీత రాజ్‌కుమార్ దంపతులు రూ.3,116 విరాళం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు వెంకటేశ్వర్లు, భీమేశ్వర్, జనార్దన్, సురేందర్ తదితరులు ఉన్నారు.

ఆడె గజేందర్‌కు సన్మానం



ఆడె గజేందర్‌ను సన్మానిస్తున్న నాయకులు

బోథ్: బోథ్ మండల కేంద్రానికి వచ్చిన ఆడె గజేందర్‌ను బంజారా నాయకులు శనివారం శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా సేవాలాల్ మహరాజ్ చిత్రపటాన్ని అందజేశారు. బంజారాల అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు విఠల్, రవి, లింబాజీ, సక్కారాం, రవి, అంబాజీ, నాయకులు ఉమేష్, సద్దాం, మౌలానా, తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలి

బోథ్: రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలను వెంటనే నిర్వహించాలని బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యులు జక్కుల వెంకటేశ్ డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ.. సర్పంచ్, ఎంపీటీసీల ఎన్నికలు నిర్వహించకపోవడంతో గ్రామాలకు నిధులు విడుదల కావడం లేదన్నారు. దీంతో గ్రామాల్లో అభివృద్ధి కుంటుపడిందన్నారు. ఇప్పటికే వేసవి కాలంలో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. వెంటనే ఎన్నికలు నిర్వహించాలని కోరారు.

నాగోబా ఆలయంలో ఎస్సై పూజలు



ఎస్సైని సన్మానిస్తున్న మెస్రం వంశీయులు

ఇంద్రవెల్లి: మండలంలోని కేస్లాపూర్ నాగోబా ఆలయంలో శనివారం ఇంద్రవెల్లి పోలీస్ స్టేషన్‌లో ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన సాయన్న ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మెస్రం వంశీయులు ఎస్సైని శాలువాతో సత్కరించారు. నాగోబా ఆలయ చరిత్ర, నాగోబా జాతర నిర్వహణ వివరాలను మెస్రం వంశీయులకు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో నాగోబా ఆలయ పీఠాధిపతి మెస్రం వెంకట్‌రావ్, మెస్రం వంశీయులు శేక్‌నాథ్, నాగ్‌నాథ్, ఆనంద్‌రావ్, బాదిరావ్ పటేల్, కొట్నాక కోసేరావ్, తదితరులు పాల్గొన్నారు.

అమరుల సంస్మరణ దినోత్సవానికి తరలిరండి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

ఇంద్రవెల్లి: భూమి కోసం.. భుక్తి కోసం పోరాడి పోలీసుల కాల్పుల్లో అమరులైన ఈనెల 20న అమర వీరుల స్తూపం వద్ద నిర్వహించే అమరుల సంస్మరణ దినోత్సవానికి ప్రతీ గ్రామం నుంచి ఆదివాసీలు తరలిరావాలని తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు పుర్క బాపురావ్ పిలుపునిచ్చారు. శనివారం మండలంలోని గిన్నేర, ముత్నూర్, కేస్లాపూర్ గ్రామాల్లో పర్యటించి కార్యక్రమం పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆదివాసీ నాయకులు కొట్నాక్ భారిక్‌రావ్, కోవ రాజేశ్వర్, మెస్రం భీంరావ్, లక్కేరావ్, తదితరులు పాల్గొన్నారు.

నీటి కష్టాలు





ఆదిలాబాద్‌టౌన్(జైనథ్): గ్రామీణ ప్రాంతాల్లో నీటి కష్టాలు తీవ్రమయ్యాయి. నీటి ఎద్దడితో ప్రజలు అల్లాడిపోతున్నారు. భూగర్భజలాలు అడుగంటిపోతున్నాయి. మిషన్ భగీరథ నీరు సరఫరా కాకపోవడంతో భోరజ్ ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. తరోడ గ్రామం వద్ద మిషన్ భగీరథ పైపు మరమ్మతులు కారణంగా నీరు రావడం లేదు. అదేవిధంగా గత మూడు రోజులుగా త్రీఫేజ్ లైన్ సమస్య కారణంగా బోర్లు పనిచేయడం లేదని గిమ్మ గ్రామానికి చెందిన పలువురు వాపోతున్నారు. గంటల తరబడి చేతిపంపుల వద్ద నీటి కోసం బారులు తీరారు. వ్యవసాయ క్షేత్రాల్లో గల బోరుబావుల వద్ద నుంచి నీటిని తెచ్చుకుంటున్నారు. అధికారులు స్పందించి మిషన్ భగీరథ నీటి సరఫరా చేయాలని కోరుతున్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎమ్మెల్యే

తలమడుగు: క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. శనివారం మండలంలోని ఖోసాయి గ్రామంలో కబడ్డీ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్రీడల ద్వారా పోటీతత్వం పెరుగుతుందన్నారు. తప్పనిసరిగా యువత క్రీడలు ఆడాలని సూచించారు. క్రీడలలో గెలుపోటములు సహజమన్నారు. ఓటమి పాలైన వారు కుంగి పోకుండా గెలుపు కోసం కృషి చేయాలన్నారు. యువత క్రీడలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు వెంకటేశ్, కేదారేశ్వర్ రెడ్డి, కిరణ్ కుమార్, దేవ్ రావు, ప్రకాష్ పాల్గొన్నారు.

వ్యవసాయంలో ఆదర్శంగా జామిడి

తాంసి: జిల్లాలోనే జామిడి గ్రామంలోని రైతులు ఆధునిక వ్యవసాయం చేస్తూ పంట దిగుబడులు సాధిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. శనివారం మండలంలోని జామిడి గ్రామంలో వీడీసీ ఆధ్వర్యంలో నిర్వహించిన రైతు సన్మాన సభకు హాజరయ్యారు. గ్రామానికి చెందిన ఉత్తమ రైతులను ఎమ్మెల్యే శాలువాతో సన్మానించారు. అనంతరం షెడ్డు నిర్మాణానికి భూమిపూజ చేశారు. పాలోది గ్రామానికి చెందిన పలువురు నాయకులు బీఆర్ఎస్‌లో చేరగా.. కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. గ్రామాల్లో ఎలాంటి సమస్య ఉన్నా.. పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అమలు చేసిన పథకాలతో రైతులు ఆర్థికంగా ఎదిగరని గుర్తు చేశారు. కార్యక్రమంలో మండల నాయకులు కృష్ణ, కొడాల మహేందర్, నాగారెడ్డి, రజనీకాంత్ రెడ్డి, ఆశన్న, గోవర్ధన్, ప్రీతం రెడ్డి, పాల్గొన్నారు.